సాక్షి ఒడిశా

సోమవారం । 16 । సెప్టెంబర్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం ఆదివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.9,16,012లు, బంగారం 3 గ్రాముల 250 మిల్లీగ్రాములు వెండి 187 గ్రాముల 400 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



హోరాహోరీగా ఫుట్‌బాల్ టోర్నీ

రాజధాని భువనేశ్వర్‌లో టాటా స్టీల్ ఆధ్వర్యంలో ఫ్రెండ్లీ ఫుట్‌బాల్ టోర్నమెంట్ హోరాహోరీగా సాగింది. విజేతలకు సీఎం మాఝీ బహుమతులు అందించారు.

- 8లో



ఏచూరి మృతి తీరని లోటు

వామపక్ష యోధుడు, సీపీఎం జాతీయ కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి మృతి తీరని లోటని కొరాపుట్ జిల్లా కమ్యూనిస్టు పార్టీ ప్రతినిధులు పేర్కొన్నారు.

- 8లో

‘సుభద్ర’కు స్వాగతం

- రాష్ట్ర వ్యాప్తంగా సుభద్ర స్వాగత్ పాదయాత్రలు
- ప్రజల్లో విస్మృత అవగాహన కల్పించేందుకే: డిప్యూటీ సీఎం ప్రభాతి పరిడా
- మహిళా సాధికారతే లక్ష్యంగా సుభద్ర యోజన అమలు చేస్తున్నట్లు స్పష్టీకరణ
- ఐదేళ్లలో రూ.50 వేలు జమ చేస్తామని వెల్లడి
- ప్రయోగాత్మకంగా రూపాయి చొప్పన ఖాతాలకు బదిలీ



భువనేశ్వర్: సుభద్ర ప్రచార పాదయాత్ర ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రులతో నాయకులు



భువనేశ్వర్: సుభద్ర స్వాగత్ పాదయాత్రలో పాల్గొన్న మహిళలు

భువనేశ్వర్: రాష్ట్ర వ్యాప్తంగా ఆదివారం సుభద్ర స్వాగత్ పాదయాత్ర కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రులు ప్రభాతి పరిడా, కనక వర్ధన్ సింగ్ దేవ్ జెండా ఊపి పాదయాత్రలు ప్రారంభించారు. వీరితో స్థానిక లోక్‌సభ సభ్యురాలు అపరాజిత షడంగి, ఎమ్మెల్యే బాబూ సింగ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం ప్రభాతి మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళా సాధికారత లక్ష్యంగా పథకాన్ని అమలు చేస్తామని చెప్పారు. పథకంపై అన్ని వర్గాల వారికి అవగాహన కల్పించేందుకు స్వయం సహాయక బృందాల (ఎస్‌హెచ్‌జీ) సభ్యులతో పాదయాత్రగా ప్రచారం చేయిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల హామీలో భాగంగా సుభద్ర యోజన కింద 21 నుంచి 60 ఏళ్ల మధ్య అర్హులైన మహిళలందరికీ ఐదేళ్ల పాటు ఏటా రెండు సమాన వాయిదాలలో రూ.10,000 చొప్పున మొత్తం రూ.50 వేలు నగదు బదిలీ చేస్తామని వివరించారు. ఆర్థిక లావాదేవీల్లో మహిళలు డిజిటల్ అక్షరాస్యత సాధించేందుకు కూడా పథకం దోహదపడుతుందని పేర్కొన్నారు. పాదయాత్రలో భాగంగా మహిళలకు సుభద్ర యోజన ఉద్దేశం వివరించి దరఖాస్తు చేసే విధానం, ఇతర అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే సుభద్ర యోజన కింద 50 లక్షల మంది మహిళలు నమోదు చేసుకున్నారని చెప్పారు ఈ నెల 17న ప్రధాన మంత్రి మోదీ పథకాన్ని అమలు చేస్తారని చెప్పారు. రక్షా బంధన్ , అంతర్జాతీయ మహిళా దినోత్సవం (మార్చి 8) సందర్భంగా అర్హులైన లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు నగదు చేస్తారని ప్రకటించారు. అనంతరం మిషన్ శక్తి, మహిళ, శిశు సంక్షేమ శాఖల సమన్వయంతో స్థానిక గిరి దుర్గ దేవాలయం నుంచి రమాదేవి మహిళా విశ్వవిద్యాలయం వరకు పాదయాత్ర కొనసాగించారు.

పీఎం మోదీ పర్యటనకు ఏర్పాట్లు..

ఈ నెల 17న ప్రధాని నరేంద్ర మోదీ సుభద్ర యోజన ప్రారంభానికి విచ్చేయనున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తోంది. ప్రతి పంచాయతీ, మండలం, మున్సిపల్ కార్పొరేషన్, జిల్లాలో ప్రారంభోత్సవం ప్రత్యక్ష ప్రసారం చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఇందుకు రూ. 40.21 కోట్లు వరకు వెచ్చిస్తున్నట్లు సమాచారం. శిశు సంరక్షణ సంస్థలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు. ప్రారంభోత్సవ వేదిక ప్రాంగణంలో డాటర్స్ ఆఫ్ ఒడిశా శీర్షికతో ఫొటోవాల్ ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే ఘురే ఘురే సుభద్ర నినాదంపై వివిధ కళాశాలల విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వం, రంగోలి, ఫొటోగ్రఫీ వంటి పోటీలు నిర్వహించారు.

ప్రయోగాత్మకంగా రూ.1 బదిలీ

సుభద్ర పథకం కోసం ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న అర్హులైన లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ప్రయోగాత్మకంగా ఒక రూపాయిని ప్రత్యక్షంగా బదిలీ చేసింది. ఈ నెల 15, అంతకు ముందు దరఖాస్తు చేసుకున్న వారికి ప్రారంభ రోజున వారి మొదటి విడత రూ.5,000 పొదుపు ఖాతాలకు ప్రత్యక్షంగా బదిలీ చేయనున్నారు. ఇతర లబ్ధిదారులకు కూడా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాత సహాయం అందుతుందని ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిడా తెలిపారు. అర్హులందరికీ పథకం వర్తించేలా దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతుందని హామీ ఇచ్చారు. ఈ నెల 17 తర్వాత దరఖాస్తు చేసుకున్న వారికి కూడా పథకం అందుతుందని భరోసా ఇచ్చారు.

పర్లాకిమిడిలో..



సుభద్ర స్వాగత పాదయాత్రలో మహిళలు

పర్లాకిమిడి: జిల్లా కేంద్రంలోని టౌన్‌హాలు వద్ద సుభద్ర స్వాగత పాదయాత్రను కలెక్టర్ బిజయకుమార్‌దాస్ ఆదివారం ప్రారంభించారు. స్వయం సహాయక గ్రూపులు, లబ్ధిదారులతో కలిసి మిషన్ శక్తి జిల్లా పథకాల కోఆర్డినేటర్ టిమోన్ బోరా, డీఆర్‌డీఏ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి గుణనిధి నాయక్, పర్లా పురపాలక ఈఓ గౌరచంద్ర పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం బిజూ కల్యాణ మండపంలో కలెక్టర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశంలో మిషన్ శక్తి ప్రోగ్రాం అధికారి మనస్మితా పాత్రో, డీపీఆర్‌ఓ ప్రదీప్త గురుమయి తదితరులు పాల్గొన్నారు.

మల్కన్‌గిరిలో..



ర్యాలీని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ వేద్బర్ ప్రధాన్

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి డీఈఓ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు సుభద్ర యోజన స్వాగత పాదయాత్ర నిర్వహించారు. అంతకు ముందు ఈ ర్యాలీని అదనపు కలెక్టర్ వేద్బర్ ప్రధాన్ ప్రారంభించారు. కార్యక్రమంలో డీఈఓ నరేష్‌చంద్ర, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి ప్రమీల మాఝి, జిల్లా మిషన్‌శక్తి కార్యదర్శి నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

రాయగడలో..



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ పట్వారి

రాయగడ : రాయగడ పట్టణంలో ఆదివారం సుభద్ర స్వాగత పాదయాత్ర నిర్వహించారు. కలెక్టర్ ఫరూల్ పట్వారి జెండా ఊపి కార్యక్రమం ప్రారంభించారు. స్థానిక రైల్వే స్టేషన్ నుంచి ప్రారంభమై సమితి కార్యాలయం మీదుగా జిల్లా పరిషత్ కార్యాలయం వరకు చేరుకుంది. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని ప్లకార్డులు పట్టుకుని ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఏడీఎం భాస్కర రైతా, జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వాహక అధికారి నిహారి రంజన్ కుహరి తదితరులు పాల్గొన్నారు.

జయపురంలో..



పాదయాత్రలో పాల్గొన్న మహిళలు

జయపురం : జయపురంలోని గోవర్ధనముండ పార్కులో ఆదివారం సుభద్ర స్వాగత్ పాదయాత్ర నిర్వహించి బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యనిర్వాహక అధికారి సిద్దార్థ పట్నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం రానున్న ఐదేళ్లలో మహిళల ఖాతాల్లో రూ.50 వేలు జమ చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో సమితి బీడీఓ శక్తి మహాపాత్రో తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

శ్రమదానంతో డ్రైనేజీ నిర్మాణం



కాలువను తవ్వుతున్న గ్రామస్తులు

రాయగడ: జిల్లాలోని కళ్యాణసింగుపూర్ సమితి మజ్జిగుడ పంచాయతీ ఇందిరానగర్ గ్రామస్తులు కలిసికట్టుగా మురుగునీటి కాలువను నిర్మించుకున్నారు. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఎప్పుడు వర్షమొచ్చినా ఊరి మధ్యలోనే రోజుల తరబడి నీరు నిలిచిపోవడంతో దుర్వాసన వస్తోంది. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. దీంతో గ్రామస్తులంతా ఏకమై శ్రమదానం చేసి కాలువ తవ్వారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కలతో వ్యవసాయ విద్యార్థులు

పర్లాకిమిడి: ఆర్.సీతాపురం సెంచూరియన్ యూనివర్సిటీ ఎం.ఎస్.స్వామినాథన్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు ఆదివారం గుసాని సమితి దేవితి గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటి సంరక్షించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విద్యార్థులు బర్షారాణి పాత్రో, సుమ్మయ్య బేగం, అంకితా నాయక్, శ్యామాజీ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేత మృతికి సంతాపం



అజయ్ సామంతరాయ్

జయపురం: జయపురం మునిసిపాలిటీ మాజీ కౌన్సిలర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత అజయకుమార్ సామంతరాయ్ (55) శనివారం సాయంత్రం మదలా సాహిలోని తన నివాసంలో గుండెపోటుకు గురయ్యారు. వెంటనే కుటుంబసభ్యులు జయపురం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈయన పలు పదవులలో కొనసాగి పార్టీకి సేవలందించారు. సామంతరాయ్ మృతి పట్ల ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహినీపతి, పలువురు పార్టీ నేతలు సంతాపం తెలియజేశారు.

20 నుంచి వికాస్ మేళా



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

పర్లాకిమిడి: స్థానిక గజపతి స్టేడియంలో ఈ నెల 20 నుంచి 22 వరకు జిల్లా స్థాయి అభివృద్ధి(వికాస్) మేళా నిర్వహించనున్నట్లు కలెక్టర్ బిజయకుమార్ దాస్ తెలిపారు. ఆదివారం వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో కలెక్టరేట్ కాన్ఫరెన్సు హాలులో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి శాఖ, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ విభాగం, మిషన్ శక్తి, రోడ్లు-భవనాలు, పంచాయతీరాజ్, తాగునీటి విభాగం, ఒడియా భాష, సాహిత్యం, సంస్కృతి, సుభద్ర పథకం, ఇతర శాఖల స్టాల్స్‌ను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ప్రతి రోజూ స్టాల్స్ వద్ద కళా సంస్కృతి ప్రదర్శనలు జరుగుతాయన్నారు. సమావేశంలో అదనపు పాలనాధికారి రాజేంద్ర మింజ్, ముఖ్య కార్య నిర్వహణాధికారి గుణనిధి నాయక్, సబ్ డివిజనల్ పోలీస్ అధికారి మాధవనంద నాయక్, డీఎస్పీ చంద్రశేఖర హోత్రా, బీడీఓలు, తహశీల్దార్లు పాల్గొన్నారు.

బలపడుతున్న అల్ప పీడనం

భువనేశ్వర్: అల్పపీడనం బలపడుతోంది. పశ్చిమబెంగాల్ మీదుగా ఏర్పడిన తీవ్ర అల్పపీడనం గడిచిన 6 గంటల్లో గంటకు 8 కిలో మీటర్ల వేగంతో పశ్చిమ దిశగా కదిలి ఆదివారం ఉదయం 8.30 గంటలకు కోల్‌కతా (పశ్చిమ బెంగాల్)కు పశ్చిమంగా 60 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. బంకురా (పశ్చిమ బెంగాల్)కి ఆగ్నేయంగా 110 కిలోమీటర్లు, జంషెడ్‌పూర్ (జార్ఖండ్)కి తూర్పున 170 కిలోమీటర్లు, రాంచీ (జార్ఖండ్)కి తూర్పు, ఆగ్నేయంగా 270 కిలో మీటర్లు దూరంలో కేంద్రీకృతమైంది. రానున్న 48 గంటల్లో జార్ఖండ్, ఉత్తర ఛత్తీస్‌గఢ్ మీదుగా పశ్చిమ దిశ వైపు కదులుతోంది.

ట్రాన్స్‌జెండర్లపై చిన్నచూపు తగదు



వార్షిక సమావేశంలో పాల్గొన్న అధికారులతో కిన్నెరలు

జయపురం: ట్రాన్స్‌జెండర్ల(కిన్నెరలు)ను చిన్న చూపు చూడకుండా సమాజంలో తగిన గుర్తింపు ఇవ్వాలని సమాజ సేవి జగన్నాథ్ పాత్రో అన్నారు. ఆదివారం నవరంగపూర్ కల్యాణ మండపంలో జిల్లా కిన్నెర అసోసియేషన్ వార్షిక సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కిన్నెరలకు సరైన గుర్తింపునిస్తే అన్ని రంగాల్లోనూ మంచి ఫలితాలు సాధిస్తారని చెప్పారు. జనజీవన స్రవంతిలో మమేకమయ్యేందుకు ఐక్య ఉద్యమం అవసరమన్నారు. మున్సిపల్ చైర్మన్ కునునాయిక్ మాట్లాడుతూ కౌన్సిల్ తరఫున ఎలాంటి సాయమైనా అందిస్తామని చెప్పారు. జిల్లా కిన్నెర అసోసియేషన్ అధ్యక్షుడు మనోజ్ పట్నాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో న్యాయ సలహాదారు రాంప్రసాద్ పాత్రో, సామాజిక భద్రతా అధికారి సుధాంశు పాత్రో, రాష్ట్ర కార్యదర్శి మేఘనా సాహు, రాయగడ జిల్లా ప్రతినిధి పింకి మహాపాత్రో, జిల్లా అధ్యక్షులు కాజల్, కార్యదర్శి టొమొకి పాల్గొన్నారు

జిరంగోలో స్వచ్ఛభారత్



పరిసరాలను శుభ్రం చేస్తున్న కలెక్టర్ తదితరులు



బౌద్ధ క్షేత్రంలో కలెక్టర్ బిజయకుమార్‌దాస్

పర్లాకిమిడి:

గజపతి కలెక్టర్ బిజయకుమార్ దాస్ మోహనా నియోజకవర్గంలో ఆదివారం సుడిగాలి పర్యటన నిర్వహించారు. తొలుత చంద్రగిరి, జిరంగోలో టిబెటియన్ పద్మనాభ మహావీర సంభవ మొనాస్ట్రీని సందర్శించారు. అనంతరం జిరంగోలో నిర్వహించిన స్వచ్ఛభారత్ కార్యక్రమంలో పాల్గొన్నారు. బలిగండలో జరిగిన ప్రజాదర్బార్‌లో పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. చాందిపుట్‌లో పట్టుపురుగుల కేంద్రాలు, మట్టి సంరక్షణ కేంద్రాలను సందర్శించారు. అనంతరం మోహనా బ్లాక్‌లో వివిధ ప్రభుత్వ పథకాల అమలుపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.

ప్రధాని పర్యటనకు భారీ భద్రతా ఏర్పాట్లు

భువనేశ్వర్: స్థానిక జనతా మైదాన్‌లో ఈ నెల 17న రాష్ట్ర ప్రభుత్వ సుభద్ర యోజనను ప్రారంభించేందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నగరానికి వస్తున్న నేపథ్యంలో భువనేశ్వర్‌లో భద్రతను కట్టుదిట్టం చేస్తున్నారు. 81 ప్లటూన్ల పోలీసు బలగాలను మోహరిస్తామని పోలీసు కమిషనర్ సంజీబ్ పండా ఆదివారం మీడియాకు తెలిపారు. 11 మంది డీసీపీ ర్యాంక్ అధికారులు, 22 మంది అదనపు డీసీపీలు, 66 మంది ఏసీపీలు, 100 మంది ఇన్‌స్పెక్టర్ ఇన్‌చార్జిలు, 300 మంది సీనియర్ పోలీసు అధికారులను మోహరిస్తున్నామని చెప్పారు. పెద్ద సంఖ్యలో మహిళా పోలీసు అధికారులను నియమించనున్నామని తెలిపారు. ఎస్‌టీయూ, ఒడ్రాఫ్, సీఆర్‌పీఎఫ్ వర్గాల నుంచి ఆరు యూనిట్లు భద్రతా కార్యకలాపాల్లో పాలుపంచుకుంటాయని వివరించారు. మరోవైపు స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ (ఎస్‌పీజీ) అధికారులు కూడా భద్రతా చర్యలను సమీక్షించారు. ఏర్పాట్లకు సంబంధించి ఒడిశా అధికారులతో చర్చలు జరిపారు. భద్రత, రద్దీ నియంత్రణను పర్యవేక్షించడానికి 50 మంది అధికారులను నియమించారు. నగర వ్యాప్తంగా ప్రజలు ప్రధాన మంత్రి కార్యక్రమం తిలకించేందుకు ఎంపిక చేసిన ప్రదేశాలలో ఎల్‌ఈడీ టీవీలను ఏర్పాటు చేస్తున్నారు. స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయం (బీపీఐఏ) నుంచి జనతా మైదాన్‌కు వెళ్లే మార్గంలో దారి పొడవునా బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నట్లు డీసీపీ ప్రతీక్ సింగ్ తెలిపారు. కాగా, ప్రధాన మంత్రి కార్యక్రమం దాదాపు రెండు గంటల పాటు ఉంటుందని సమాచారం.

ప్రధానికి బహుమతిగా డొంగిరియా శాలువ



డొంగిరియాలు రూపొందించిన శాలువ (ఫైల్)

రాయగడ: దేశ ప్రధాని నరేంద్ర మోదీకి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకమైన డొంగిరియా శాలువాను బహుమతిగా ఇచ్చేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. సుభద్ర యోజనను ప్రారంభించేందుకు ఈ నెల 17న భువనేశ్వర్ రానున్న ప్రధానిని స్వాగతిస్తూ ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి చేతుల మీదుగా డొంగిరియాలు రూపొందించిన శాలువతో సత్కరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. నియమిగిరి పర్వత ప్రాంతాల్లో నివసిస్తున్న డొంగిరియా కొంధొ తెగకు చెందిన ఆదివాసీలు తయారు చేసే ఈ శాలువలకు జీఐ ట్యాగ్ గుర్తింపు కూడా పొందింది. ఈ నేపథ్యంలో ప్రధాని వంటి ప్రముఖులకు డొంగిరియాతో సత్కరిస్తే అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తుందన్న ఆశాభావాన్ని డొంగిరియాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రధానితో పాటు మిగతా అతిథులకు కూడా శాలువలతో సత్కరించనున్నారని, ఇప్పటికే 25 శాలువలు పంపించినట్లు సమాచారం.

ఒడిశాకు మరో రెండు వందేభారత్ రైళ్లు



బరంపురం - టాటా వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోదీ



ప్రయాణికులకు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి



ఖుర్దారోడ్ రైల్వే స్టేషనులో సాంస్కృతిక ప్రదర్శన

భువనేశ్వర్: ఒడిశాలో మరో రెండు వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆదివారం వర్చువల్‌గా జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా బరంపురం స్టేషన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సిల్క్ సిటీ బరంపురం నుంచి స్టీల్ సిటీ టాటా వరకు నడవనున్న వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు జెండా ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి పాల్గొన్నారు. ఈ రైలు రవాణా రాష్ట్రాభివృద్ధిలో ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుందన్నారు. మౌలిక సదుపాయాల కల్పనలో దేశం అగ్రగామిగా నిలుస్తోందని పేర్కొన్నారు.

ప్రయాణ వేళలు ఇలా..

- ఈ రైలు రాష్ట్రంలో భువనేశ్వర్, కెందుఝొరొగొడొ మీదుగా బరంపురం జార్ఖండ్‌లోని టాటానగర్ జంక్షన్ మధ్య రాకపోకలు సాగిస్తుంది. మంగళవారం మినహా వారానికి 6 రోజులు పనిచేస్తుంది. ప్రతిరోజూ ఉదయం 5.20 గంటలకు టాటానగర్‌లో బయలుదేరి తొమ్మిది గంటల పది నిమిషాల పాటు ప్రయాణించి బరంపురం చేరుతుంది. ఈ మార్గంలో బొంసాపాణి, నయాగఢ్, కెందుఝొరొగొడొ, హరిచందన్‌పూర్, జఖాపురా, కటక్, భువనేశ్వర్, ఖుర్దారోడ్, బలుగాంవ్ హాల్టులతో మధ్యాహ్నం 2.30 గంటలకు బరంపురం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో బరంపురంలో మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరి అదే రోజు రాత్రి 11.55 గంటలకు టాటానగర్ చేరుకుంటుంది.
- రాష్ట్రంలో ఇప్పటికే మూడు వందే భారత్ రైళ్లు నడుస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఇటీవల బడ్జెట్‌లో రైల్వే మౌలిక సదుపాయాల కోసం రాష్ట్రానికి రూ. లక్ష కోట్లు నిధుల్ని కేటాయించింది. రూ. 70,000 కోట్ల విలువైన ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. ఈ కార్యక్రమాలు రాష్ట్ర రైల్వే నెట్‌వర్క్ సామర్థ్యాన్ని పెంపొందించనున్నాయి. రూర్కెలా, హౌరా మధ్య వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ను కూడా ప్రారంభించారు. ఈ రెండు రైళ్లతో ఒడిశా మీదుగా వెళ్లే వందేభారత్ రైళ్ల సంఖ్య ఐదుకు చేరింది.

క్లుప్తంగా

ఒడిశా బాలుడికి రూ. 45 వేల సాయం



బాలుడితో సేవా సంఘం సభ్యులు

కంచిలి: ఒడిశా రాష్ట్రం జయంతిపురం గ్రామానికి చెందిన తనీష్‌కు మండలంలోని జాడుపూడి గ్రామానికి చెందిన కాళీదుర్గామాత సంఘం అండగా నిలిచింది. రఘునాథ్ , దీపుల కుమారుడు తనీష్ రోడ్డు ప్రమాదంలో ఇటీవల గాయపడ్డారు. శస్త్ర చికిత్స కోసం డబ్బులు అవసరమయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న కాళీదుర్గామాత సంఘం సభ్యులు 45 వేల రూపాయలు సేకరించారు. ఈ మొత్తాన్ని బాధిత కుటుంబ సభ్యులకు ఆదివారం అందజేసి ఆదర్శంగా నిలిచారు.

ఆట అదిరింది



నేషనల్ అథ్లెట్ బి.బాలాజీని ఘనంగా సత్కరిస్తున్న ధర్మాన కృష్ణదాస్, ఎమ్మెల్యే కూన రవి, గుండ, వాసు, తదితరులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ (ఆర్ట్స్) కళాశాల మైదానంలో కొన్న చిన్నారావు మెమోరియల్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్–2024 పోటీలు ఆదివారం ఉత్సాహంగా జరిగాయి. క్రీడలతో ఆరోగ్యవంతమైన సమసమాజ నిర్మాణం సాధ్యపడుతుందని శ్రీకాకుళం, రాజాం నియోజకవర్గాల ఎమ్మెల్యేలు గొండు శంకర్, కోండ్రు మురళీమోహన్ పేర్కొన్నారు. పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై కొన్న చిన్నారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం 600 మీటర్ల పరుగుపందెంను జెండా ఊపి ప్రారంభించారు. ఈవెంట్లలో విజేతలకు పతకాలు, ప్రసంశా పత్రాలను అందజేశారు. కొన్న చిన్నారావు కుమారుడు, విశాఖపట్నం వీఎంఆర్‌డీఏ ప్లానింగ్ ఆఫీసర్ కొన్న వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తమ తండ్రి కొన్న చిన్నారావు మెమోరియల్ పేరిట కుటుంబ సభ్యులు, స్నేహితులు, ఆప్తుల సహకారంతో గత 16ఏళ్లగా క్రీడాపోటీలను నిర్వహిస్తుండటం ఆనందంగా ఉందన్నారు.

ముగింపు కార్యక్రమానికి కూన, దాసన్న హాజరు

సాయంత్రం జరిగిన ముగింపు, బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమానికి ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్, ఒలింపిక్ అసోసియేషన్ రాష్ట్ర,జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, మాజీ మంత్రి గుండ అప్పలసూర్యానారాయణ, శ్రీకాకుళం మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎంవీ పద్మావతి తదితరులు హాజరై పతకాలు, ప్రసంశాపత్రాలను అందజేశారు. ఒక ప్రభుత్వం చేయాల్సిన పనిని ఒక కుటుంబం చేస్తుండటం గొప్ప విషయమని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. వెటరన్ నేషనల్ అథ్లెట్ బి.బాలాజీ(బిలాస్‌పూర్)ను ఘనంగా సత్కరించారు. మీట్‌కు జిల్లా నలుమూలల నుంచి రికార్డు స్థాయిలో 700 మందికిపైగా క్రీడాకారులు తరలివచ్చారు.

ఆసక్తికరంగా టెన్నీ కాయిట్ పోటీలు

వజ్రపుకొత్తూరు రూరల్: వజ్రపుకొత్తూరులో శనివారం ప్రారంభమైన 36వ ఆంధ్రప్రదేశ్ అంతర జిల్లాల (రాష్ట్ర స్థాయి) బాల బాలికల టెన్నీ కాయిట్ క్రీడా పోటీలు ఆసక్తిగా సాగుతున్నాయి. ఈ పోటీల్లో బాలుర విభాగం నుంచి ఎన్.గౌతమ్ సంజయ్ (తూర్పుగోదావరి), జి.మహిధర్ (అనంతపురం), ఎస్.సాయి కుమార్ (విజయనగరం), కేఎస్ శంకరప్రసాద్ (తూర్పుగోదావరి)తో పాటు బాలికల విభాగం నుంచి కె.జ్యోతిక (అనంతపురం), హెచ్.స్పందన (అనంతపురం), ఆర్.సాంస్కృతి (పశ్చిమగోదావరి), హెచ్.దీక్షిత (అనంతపురం) జిల్లాకు చెందిన క్రీడాకారులు ప్రతిభ కనబర్చి సెమీఫైనల్‌కు చేరారు. ఈ క్రీడా పోటీలను వ్యాయామ ఉపాధ్యాయులు పైల గజేంద్ర, పాఠశాల ప్రధానోపాధ్యాయులు తారకేశ్వర పండా పర్యవేక్షిస్తున్నారు.

హోరాహోరీగా ఫుట్‌బాల్ టోర్నీ

- విజేతలుగా నిలిచిన లీడర్స్ లెవన్ గెలుపు
- బహుమతులు ప్రదానం చేసిన సీఎం మోహన్‌చరణ్ మాఝీ



ట్రోఫీతో టీం కెప్టెన్, పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి



బహుమతి ప్రదానోత్సవంలో మాట్లాడుతున్న సీఎం మోహన్‌చరణ్ మాఝి

పర్లాకిమిడి: భువనేశ్వర్‌లో టాటా స్టీల్ ఆధ్వర్యంలో ఫ్రెండ్లీ ఫుట్‌బాల్ టోర్నమెంట్ ఆదివారం హోరాహోరీగా సాగింది. లీడర్స్ లెవెన్, టాటా స్టీల్ లెవెన్, ఆఫీసర్స్ లెవెన్, మీడియా లెవెన్ జట్లు విజయమే లక్ష్యంగా పోరాడాయి. ఫైనల్లో ఆఫీసర్స్ లెవెన్ జట్టుపై లీడర్స్ లెవన్ విజయం సాధించింది. ఇందులో మంత్రి రబినారాయణ నాయక్ మూడు గోల్స్ చేసి గెలుపులో కీలకపాత్ర పోషించారు. అనంతరం జరిగిన బహుమతుల ప్రదానోత్సవంలో ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి, ఉప ముఖ్యమంత్రులు కనకవర్ధన్ సింగ్, ప్రతిభా పరిడాలు విచ్చేసి విజేతలకు ట్రోఫీ అందజేశారు. లీడర్స్ లెవన్‌లో పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహితో పాటు పలువురు ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహించారు. కార్యక్రమంలో మంత్రులు పృథ్వీరాజ్ హరిచందన్, ముఖేష్ మహాలింగ, నిత్యానంద గోండో, ఎమ్మెల్యే సిద్ధాంత మహాపాత్రో, ఎంపీ సంగీత సింహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి మృతి తీరని లోటు

జయపురం:

వామపక్ష యోధుడు, సీపీఎం జాతీయ కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి మృతి తీరని లోటని కొరాపుట్ జిల్లా కమ్యూనిస్టు పార్టీ ప్రతినిధులు పేర్కొన్నారు. ఆదివారం జయపురంలోని యాదవ భవనంలో సంతాప సభ నిర్వహించారు. రాష్ట్ర కమ్యూనిస్టు పార్టీ కార్యవర్గ సభ్యుడు, కార్మిక నేత ప్రమోద్ కుమార్ మహంతి హాజరై ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సంతాప సభలో సీపీఐ జిల్లా కార్యదర్శి జుధిష్టర్ రౌళో మాట్లాడుతూ దేశంలో వామపక్షాలు, ప్రజాస్వామ్యవాదులను ఏకం చేయడంలో, కమ్యూనిస్టు ఉద్యమాన్ని బలోపేతం చేయడంలో సీతారాం కీలక భూమిక పోషించారని గుర్తు చేశారు. బడుగుల హక్కుల సాధనకు విశేష కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి రామకృష్ణ దాస్, సత్యబ్రత నంద, బసంత బెహరా, సన్యాసి మాలి తదితరులు పాల్గొన్నారు.



ఏచూరి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కమ్యూనిస్టు నేతలు

మిడ్‌నైట్ దోపిడీ

- రాత్రిపూట ప్రతీరోజూ 1000కి పైగా వాహనాల్లో తరలిపోతున్న ఇసుక
- పచ్చనేతలకు రూ.కోట్లు కురిపిస్తున్న ఉచిత ఇసుక
- వంశధార, నాగావళి నదులను తోడేస్తున్న అక్రమార్కులు
- ఫోన్ ద్వారా బుకింగ్
- ఫోన్‌పే ద్వారా చెల్లింపులు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

- అధికార పార్టీ నాయకులకు ఉచిత ఇసుక కాసులు కురిపిస్తోంది. బూర్జ మండలం నారాయణపురం, చిన అంకలాం వద్ద రాత్రికి రాత్రే తవ్వకాలు జరిపి, భారీ లారీల్లో ఇసుక తరలించేస్తున్నారు. ట్రాక్టర్ ఇసుకను రూ.35వేల నుంచి రూ.40వేలకు పైగా విక్రయిస్తున్నారు. రాత్రి 12గంటల నుంచి ఉదయం 4 గంటల్లోపు వందలాది లారీల ఇసుక తరలిపోతోంది.
- శ్రీకాకుళం రూరల్ పరిధిలోని బైరి, కరజాడ, కళ్లేపల్లి, కిల్లిపాలెం, బట్టేరు, బూరవల్లి, లొద్దలపేట, సింగూరు, నైరాతో పాటు గార, పొన్నాం నుంచి రాత్రిపూట పెద్ద ఎత్తున ఇసుక అక్రమంగా తరలిపోతోంది. పచ్చనేతల కనుసన్నల్లో దర్జాగా దోపిడీ జరుగుతోంది. తెల్లవారయ్యేసరికి తమ పని కానిచ్చేస్తున్నారు. ప్రజలు నిద్ర లేచే లోపు దందా ముగించేస్తున్నారు. ఒక్కొక్క లారీకి రూ. 30వేలకు వసూలు చేసి అప్పనంగా సంపాదిస్తున్నారు.
- ఆమదాలవలస మండలం నిమ్మతొర్లాడ, దూసి, తోటాడ, అక్కివరం, తొగరాం, బెలమం, కొత్తవలస వద్ద లారీలు, ట్రాక్టర్లతో అర్ధరాత్రి దాటక ఇసుక తరలించేస్తున్నారు. ఆ సమయంలో అటు వైపుగా వెళ్తే లారీల జాతర కనిపిస్తోంది. విశాఖ, అనకాపల్లి వరకు ఇక్కడి నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. లారీ ఇసుకను రూ. 35వేలకు పైగా విక్రయించి తెలుగు తమ్ముళ్లు భారీగా లబ్ధిపొందుతున్నారు. పొందూరు మండలం సింగూరు నుంచి ఇదే రకంగా ఇసుక దోపిడీ జరుగుతోంది.
- నరసన్నపేట నియోజకవర్గ పరిధిలోని మడపాం, లుకలాం, బుచ్చిపేట, చేనులవలస, చెవ్వాకులపేట, గోపాలపెంట, పర్లాం, దొంపాక, ఉర్లాం నుంచి భారీగా ఇసుక తరలిపోతోంది. అధికార పార్టీ నాయకులు దర్జాగా ఇసుక దోపిడీ చేస్తున్నారు. ఒక్కో లారీకి రూ. 30వేల నుంచి రూ.35వేలకు వసూలు చేసి సొమ్ము చేసుకుంటున్నారు.
- పాతపట్నం నియోజకవర్గంలోని కొత్తూరు, హిరమండలం తదితర ప్రాంతాల నుంచి రాత్రిపూట గుట్టు చప్పుడు కాకుండా ఇసుక తరలిపోతోంది. ఒక్కసారిగా లారీల తాకిడి ఎక్కువవడం వల్ల స్థానికుల తీవ్ర అసౌకర్యం కలగడంతో ఇటీవల ఆకుల తంపర నుంచి విశాఖకు తరలిస్తున్న ఇసుక లారీలను రామకృష్ణాపురం, సోమరాజపురం గ్రామస్తులు పట్టుకుని అధికారులకు అప్పగించారు.



జలుమూరు పోలీస్‌స్టేషన్‌లో ఉన్న ఇసుక లారీలు



ఇలా చెప్పుకుంటే జిల్లాలో ఇసుక దొరికే ప్రతి ప్రాంతంలో మిడ్‌నైట్ దందా నడుస్తోంది. అక్రమార్కులు మాఫియాగా తయారై ఇసుక దోచేస్తున్నారు. వంశధార, నాగావళి నదులను తోడేసి, నిశీధిలో కోట్లు గడిస్తున్నారు. అంతా ఫోన్‌లోనే వ్యాపారం చేసేస్తున్నారు. వంశధార, నాగావళికి ఆనుకుని ఎక్కడెక్కడ ఇసుక అక్రమ విక్రయాలు జరుగుతున్నాయి? ఎవరు చేస్తున్నారు? ఎవరిని కాంటాక్ట్ చేస్తే పని అవుతుందనే సమాచారం ముందే లీకు చేసి అక్రమ వ్యాపారాన్ని సాగిస్తున్నారు. ముఖ్యంగా విశాఖపట్నం, గాజువాక, అనకాపల్లి ప్రాంతాలకు చెందిన లారీల సిబ్బంది.. ఆ వ్యక్తులను సంప్రదించి, తమకు కావాల్సిన తీసుకెళ్తున్నారు. చెల్లింపులు కూడా ఫోన్‌పేలోనే జరిగిపోతున్నాయి. లావాదేవీలంతా పగలు జరగ్గా, ఇసుక తరలింపు అర్ధరాత్రి తర్వాత చేస్తున్నారు. ఇసుక దోపిడీ దారులు పక్కా ప్లాన్ ప్రకారం చేస్తున్నారు. ఇసుక తరలించే సమయంలో కిలోమీటర్‌కు ఒక వ్యక్తిని పెట్టి, వెళ్లే మార్గంలో ఎలాంటి అసౌకర్యం, ఇబ్బందుల్లేవని నిర్ధారించుకున్నాక ఇసుక అక్రమ రవాణా సాగిస్తున్నారు. భారీ లారీలకు ఇసుక లోడ్ చేసేందుకు వంశధార, నాగావళి నదిలోని అక్రమ పాయింట్ల వద్ద ఏకంగా జేసీబీలు, పొక్లెయినర్లు వినియోగిస్తున్నారు.

అధికారులకు తెలుసా?

అధికారుల కళ్లు గప్పి అక్రమార్కులు పక్కా ప్లాన్ ప్రకారం ఇసుక దందా చేస్తున్నారు. పగలంతా నదులకు వెళ్లే మార్గాల్లో ట్రెంచ్‌లు తవ్వేసి ఉంటాయి. రాత్రికి కప్పేసి అదే దారి గుండా భారీ వాహనాలతో ఇసుక తరలిస్తున్నారు. తెల్లవారే సరికి మళ్లీ అక్కడ ట్రెంచ్‌లు కన్పిస్తుంటాయి. పగలు చూసే వారికి అక్కడెటువంటి తవ్వకాలకు, తరలింపునకు ఆస్కారం లేదని అభిప్రాయాన్ని కలిగించి దోపిడీ పర్వాన్ని సాగిస్తున్నారు. కొన్నిచోట్ల నేరుగా ర్యాంపుల్లోకి వాహనాలు రానవసరం లేకుండా గుట్టు చప్పుడుగా సిద్ధం చేసిన ఇసుక పోగుల వద్దకు రప్పించి ఇసుకను రవాణా చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా అర్ధరాత్రి దాటాక రోజుకి 1000 లారీలకు పైగా ఇసుక తరలిపోతున్నట్టుగా తెలుస్తోంది. ఒక్కో లారీకి రూ. 30వేల నుంచి రూ. 40వేలు వరకు వసూలు చేస్తున్నారు. దీన్నిబట్టి జిల్లాలో ప్రతి రోజూ రూ.3కోట్ల నుంచి రూ.4కోట్ల వరకు ఇసుక దోపిడీ జరుగుతున్నట్టుగా స్పష్టమవుతోంది. ప్రభుత్వం చెబుతున్న ఉచిత ఇసుక విధానంతో ప్రజలకు మేలు జరకపోయినా అధికార పార్టీ నాయకులకు మాత్రం దండిగా కాసులు కురిపిస్తోంది. దీన్ని ఆపే పరిస్థితి లేదు. ఒకవేళ ఎక్కడైనా వాహనాలు పట్టుబడితే ఒడిశా నుంచి తీసుకొస్తున్నట్టుగా ఒడిశా రశీదులు చూపిస్తూ తప్పించుకుంటున్నారు. ఒడిశా నుంచి ఆ రశీదులు ముందే తెప్పించుకుని రవాణా లారీలకు ఇస్తున్నారో...లేదంటే ఒడిశా పేరుతో రశీదులను డూప్లికేట్‌గా ముద్రించి రవాణాదారులకు అందిస్తున్నారో తెలియడం లేదు గాని ఒడిశా రశీదులు కూడా పెద్ద ఎత్తున జిల్లాలో హల్‌చల్ చేస్తున్నాయి.

మూడు ఇసుక లారీలు సీజ్

జలుమూరు: మాకివలస నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు లారీలను సీజ్ చేసి జలుమూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించామని ఎస్‌ఐ బి.అశోక్‌బాబు ఆదివారం తెలిపారు. నరసన్నపేట సీఐ శ్రీనివాసరావుతోపాటు సిబ్బంది మాకివలస వంశధార నది నుంచి తరలిస్తున్న వాహనాలను మాటు వేసి పట్టుకున్నారని పేర్కొన్నారు. ఇసుకను ఆయా వాహనాల్లో లోడింగ్ చేసేందుకు వినియోగించిన జేసీబీ, ఒక కారును కూడా స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

తప్పించుకున్న మరో మూడు వాహనాలు

ఇసుక అక్రమ రవాణా జరుగుతుందన్న సమాచారం మేరకు పోలీసులు వెళ్లి మూడు లారీలు పట్టుకునే లోపే మరో మూడు లారీలు కొమనాపల్లి వంతెన దాటిపోయినట్లు సమాచారం. కాగా దాడిలో దొరికిన మూడు వాహనాల్లో రెండు కోటబొమ్మాళి మండలం మంచాలపేటకు చెందిన ఓ టీడీపీ నాయకుడివి కాగా మరో లారీ నరసన్నపేటకు చెందిన ఓ టీడీపీ నాయకుడిదని సమాచారం.

ఇసుక పోగుల మాటేమిటి ?

ఇసుక అక్రమ రవాణా చేస్తున్న మూడు వాహనాలను, కారు, జేసీబీని పోలీసులు పట్టుకున్నారు. కానీ అక్కడ స్థానిక టీడీపీ నాయకుడు కల్లాలో నిల్వ ఉంచిన సుమారు 60 నుంచి 70 టన్నులు ఇసుక పోగులపై చర్యలు లేవా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ ఇసుక పోగులను సీజ్ చేస్తే అటు ప్రభుత్వానికి ఆదాయం ఇటు ఇసుకాసురులు మరో సారి ఇలా తరలించేందుకు భయపడాతారని పలువురు బావిస్తున్నారు. దీనిపై ఎస్‌ఐ అశోక్‌బాబు మాట్లాడుతూ నిల్వ చేసిన ఇసుక పోగులు చూసే బాధ్యత రెవెన్యూ శాఖదన్నారు. తహసీల్దార్ జి.లక్ష్మీనారాయణను వివరణ కోరగా వీఆర్వోను పంపించి ఇసుక పోగుల నిల్వలు సీజ్ చేస్తామన్నారు.

నేడు మీకోసం రద్దు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఈ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (మీకోసం) వినతుల స్వీకరణ కార్యక్రమం లేదని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలియజేసారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటనలో కలెక్టర్ తెలిపారు. మిలాదిన్‌నబీ ప్రభుత్వ సెలవు దినం సందర్భంగా వినతుల స్వీకరణ కార్యక్రమం ఈ వారం నిర్వహించడం లేదని తెలిపారు.

'మోక్షగుండం'కు ఘనంగా నివాళి



మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

అరసవల్లి: మోక్షగుండం విశ్వేశ్వరయ్యను యువ ఇంజినీర్లు ఆదర్శంగా తీసుకోవాలని పీఆర్ ఇంజినీర్లు అన్నారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా శ్రీకాకుళంలోని జెడ్పీ ఆవరణలోని మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పీఆర్ ఇంజినీర్లు పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నగరంలోని బెహరా మనోవికాసకేంద్రంలోని చిన్నారులకు పండ్లు పంపిణీ చేశారు. రక్తదాన శిబిరాన్ని నిర్వహించి 47 యూనిట్ల రక్తాన్ని సేకరించారు.

17న విశ్వకర్మ జయంతి వేడుకలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: విశ్వకర్మ భగవానుడి గొప్పదనాన్ని గుర్తించి రాష్ట్ర పండుగగా సెప్టెంబర్ 17వ తేదీన 'విశ్వకర్మ జయంతి'ని జరుపుకోవడానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచనల మేరకు జిల్లా కలెక్టరేట్ సమావేశం మందిరంలో సెప్టెంబర్ 17న మంగళవారం ఉదయం 10.30 గంటలకు కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు, కుల పెద్దలు, వివిధ శాఖల జిల్లా అధికారులు సిబ్బంది తదితరులు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి బి.అనురాధ కోరారు.

32 కిలోల గంజాయి స్వాధీనం

ఇచ్ఛాపురం:

పట్టణాన్ని కేంద్రంగా చేసుకుని గంజాయిని అక్రమ రవాణా చేసేందుకు ప్రయత్నించిన ముగ్గురిని అదుపులోకి తీసుకున్నామని అడిషనల్ ఎస్పీ(క్రైమ్) పి.శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం సీఐ కార్యాలయం ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. ఒడిశాలోని మోహనబ్లాక్ నుంచి గంజాయిని అక్రమంగా రోడ్డు మార్గం గుండా తీసుకొచ్చి ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్ నుంచి ముంబైకి తరలించేందుకు ప్రయత్నిస్తుండగా పట్టణ పోలీసులు పట్టుకొన్నారు. తనిఖీలో వీరి వద్ద గల రెండు బ్యాగులు, ఒక సూట్ కేస్‌లలో 32.470 కేజీల గంజాయిని గుర్తించారు. వెంటనే వీరి వద్ద గల గంజాయిని స్వాధీనం చేసుకొని ఒడిశాలోని గజపతిజిల్లా, మోహనబ్లాక్ ఖరియాగుడా గ్రామానికి చెందిన ఇద్దరు యువతులు రేష్మనాయక్, సుమితనాయక్, రాయిఘుక గ్రామానికి చెందిన గజేంద్రనాయక్‌లను అరెస్టు చేసినట్టు తెలిపారు. పెద్ద మొత్తంలో గంజాయిని పట్టుకొన్న ఇచ్ఛాపురం పట్టణ పోలీసుల బృందానికి ఎస్పీ అభినందనలు తెలియజేసి రివార్డుని ప్రకటించారని వెల్లడించారు.



మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు

పర్యాటక అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం పాతబస్టాండ్: సెప్టెంబర్ 27న ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని 2023–24కు గాను ప్రకటించిన వివిధ అవార్డులకు పర్యాటక సంబంధిత రంగాల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏటా మాదిరిగానే మొత్తం 38 విభాగాల నుంచి 41 అవార్డుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. దరఖాస్తులను ఏపీ టూరిజం వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని, పూర్తి చేసిన వాటిని ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ, 5వ ఫ్లోర్, స్టాలిన్ కార్పొరేట్ బిల్డింగ్, ఆటోనగర్, విజయవాడలో ఈనెల 22వ తేదీ లోపు అందజేయాలని కోరారు.

శ్రీకాకుళం అ'ద్వితీయ'ం

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో జిల్లా జట్లు అదిరేటి ఆటతీరుతో విజయబావుటా ఎగురవేశాయి. తూర్పుగోదావరి జిల్లా అన్నవరం వేదికగా ఈనెల 13 నుంచి 15 వరకు ఏపీ రాష్ట్ర స్థాయి సబ్‌–జూనియర్స్ బాలబాలికల బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో జిల్లా బాలుర జట్టు రన్నరప్‌గా నిలవగా, బాలికల జట్టు తృతీయస్థానంలో నిలిచింది. జిల్లా జట్ల రాణింపుపై బాల్ బ్యాడ్మింటన్ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు, జిల్లా అధ్యక్షుడు పీవీజీ కృష్ణంరాజు ఆనందం వ్యక్తం చేశారు.

ఆదిత్యునికి ప్రత్యేక పూజలు

అరసవల్లి: సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. జిల్లాతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామికి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక, విశిష్ట, ఉచిత దర్శన మార్గాల్లో ఈఓ డీఎల్‌వీ రమేష్‌బాబు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అంతరాలయంలో ప్రత్యేక దర్శనంతో పాటు గోత్ర నామాలతో పూజలు చేసేలా ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ చర్యలు చేపట్టారు.

ఒక్క రోజులో వివిధ దర్శన టికెట్‌ల ద్వారా రూ.1, 26,700, విరాళాల ద్వారా రూ.48007, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.1.35లక్షలు ఆదాయం లభించినట్లు ఈఓ తెలిపారు.

వంట ఇంటిలో మంట

- నూనెల దిగుమతులపై కేంద్రం సుంకం పెంపు
- 12.5 నుంచి 32.5శాతం వరకు పెంచిన ప్రభుత్వం
- లీటరుకు రూ.20 నుంచి రూ.25 పెరుగుదల
- ఇప్పటికే నూనె ప్యాకెట్లను బ్లాక్ చేస్తున్న వైనం



హిరమండలం: సామాన్యుడి వంటి ఇంటిలో నూనె మంట రాజుకుంటోంది. కొద్ది రోజులుగా స్థిరంగా ఉన్న నూనెల ధరలు మరోసారి భగ్గుమన్నాయి. శనివారం మధ్యాహ్నం వరకు సాధారణ ధరలకు నూనె ప్యాకెట్లు విక్రయించిన వ్యాపారులు.. ఆ తర్వాత ఒక్కసారిగా నూనె ప్యాకెట్లను బ్లాక్ చేయడం, అధిక ధరకు విక్రయించడం ప్రారంభించారు. జిల్లాలోని చాలా గ్రామాల్లో ఇదే పరిస్థితి కనిపించింది. దీంతో కొనుగోలు దారులు అయోమయ పరిస్థితిలో పడిపోయారు. శుద్ధి చేసిన ఎడిబుల్ ఆయిల్‌పై కేంద్ర ప్రభుత్వం 32 శాతానికి పైగా దిగుమతి సుంకం పెంచడంతో ధరలకు రెక్కలొచ్చాయి. లీటర్ నూనెలపై ఏకంగా దాదాపు 30శాతం ధరలు పెరగడంతో సామాన్యుడి మీద పెనుభారమే పడుతోంది. సరైన పంటలు పండక రైతులు, కూలీలు, సంక్షేమ పథకాలు అందక పేద ప్రజలు ఉక్కిరిబిక్కిరిరవుతున్న తరుణంలో పెరిగిన వంటనూనెల ధరలు మరింత కలవరపడేలా చేస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలు అన్నదాతలకు తీవ్ర నష్టం మిగిల్చాయి. ఈ సమయంలో కేంద్రం ముడి చమురు, శుద్ధి చేసిన చమురు దిగుమతిపై సుంకం 20శాతానికి పెంచింది. శుద్ధి చేసిన నూనెలపై 13.75నుంచి 35.75శాతం వరకు పెంచింది.

ధరలు నియంత్రించాలి



మాది సామాన్య రైతు కుటుంబం. పంటలు పండితేనే కుటుంబం గడుస్తుంది. లేకపోతే అప్పులతో నెట్టుకు రావాలి. ఇప్పటికే పెరిగిన నిత్యావసర సరుకుల ధరలతో ఏమీ కొనలేకపోతున్నాం. ఇప్పుడు మళ్లీ నూనె ధరలు అమాంతంగా పెరిగాయి. నిత్యావసర సరుకుల ధరలపై ప్రభుత్వ నియంత్రణ లేకపోవడంతో విపరీతంగా పెరుగుతున్నాయి. ప్రభుత్వం ధరలను నియంత్రించాలి.

– కె.మాలతి, పాతహిరమండలం, హిరమండలం

పేదలపై భారం



ఇప్పటికే నిత్యావసర సరుకుల ధరలు బాగా పెరిగాయి. ఇప్పుడు వంటనూనెల ధరలు కూడా పెరగడంతో పేదలు ఏమీ కొనే పరిస్థితి లేకుండా పోతోంది. ఒక్కసారిగా ధరలు పెరగడం సామాన్యులపై భారం మోపడమే. నిత్యావసర సరుకులు, నూనెల ధరలు పేదలకు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– దీర్ఘాశి లక్ష్మీనారాయణ, హిరమండలం

దీంతో వంటనూనెల ధరలు లీటరుపై దాదాపు రూ.25నుంచి రూ.30 వరకు పెరిగాయి. శనివారం ఫ్రీడమ్ ఆయిల్ 15 లీటర్ల క్యాన్ ధర రూ.1650 ఉండగా ఆదివారం రూ.1950కి చేరింది. అలాగే పామాయిల్ లీటర్ రూ.95నుంచి రూ.100 ఉండగా నేడు రూ.130కి చేరింది. దీంతో సామాన్య ప్రజలు కొనలేని పరిస్థితి నెలకొంది.

క్లుప్తంగా

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

సాలూరు రూరల్: మండలంలోని దండిగాం వాటర్‌ఫాల్స్‌లో ఆదివారం గుర్తుతెలియని మృతదేహాన్ని స్థానికులు కొంతమంది గుర్తించారు. ఈ మేరకు పోలీసులకు వారు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. ఈ విషయమై రూరల్ ఎస్సై మాట్లాడుతూ వరదల్లో ఒడిశా ప్రాంతం నుంచి మృతదేహం కొట్టుకు వచ్చి ఉండవచ్చని అభిప్రాయం వ్యక్తం చేస్తూ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

సువర్ణముఖిలో పడి వ్యక్తి మృతి

సాలూరు రూరల్: మండలంలోని దండిగ్రాం గ్రామం వద్ద సువర్ణ ముఖి నదిలో పడి కాసాయవలస గ్రామానికి చెందిన కూనేటి వీరయ్య (54) ఆదివారం మృతి చెందాడు. దీనిపై రూరల్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాసాయవలసకు చెందిన వీరయ్య మతిస్థిమితం లేపోవడంతో చుట్టుపక్కల గ్రామాల్లో తిరుగుతూ ఉంటాడు. ఈ క్రమంలో శనివారం కూడా తిరుగుతూ నదివైపు వెళ్లి కొట్టుకుపోయాడు. ఆయనకు ఇంకా పెళ్లి కాలేదు. బంధువుల ఇంటికి వీరయ్య గుర్రపువలస వెళ్లి ఉంటాడని కుటుంబసభ్యులు భావించారు. ఈ నేపథ్యంలో వీరయ్య మృతి చెందిన విషయం తెలియడంతో నది దగ్గరకు వచ్చి చూసిన కుటుంబసభ్యులు గుర్తించారు. ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్సై నరసింహమూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

6,500 కిలోల పీడీఎస్ బియ్యం పట్టివేత

గరుగుబిల్లి: విజిలెన్స్ ఎస్పీ బర్ల ప్రసాద్ ఆదేశాల మేరకు మండలంలోని ఉల్లిభద్ర గ్రామంలో ఇర్ఫాన్ కోళ్లఫారంలో రెవెన్యూ, విజిలెన్స్ అధికారులు సంయుక్తంగా ఆదివారం దాడులు నిర్వహించి, అక్రమంగా నిల్వ ఉంచిన 6,500 కిలోల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కోళ్ల ఫారం సీజ్ చేసి యజమాని ఇర్ఫాన్, బిడ్డిక సూరన్నలపై 6ఎ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో సివిల్ సప్లయ్ డీటీ రమణారావు, కానిస్టేబుల్స్ లక్ష్మీనారాయణ, ఈశ్వరరావు పాల్గొన్నారు.

గృహిణి ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడిన పావని

శంగవరపుకోట: కట్టుకున్న భర్త పెడుతున్న ఇబ్బందులు తాళలేక మనస్తాపం చెందిన ఓ గృహిణి ఆత్మహత్యకు పాల్పడింది. కొత్తవలస లోని వెంకటశివనగర్‌లో శనివారం సాయంత్రం జరిగిన ఈ ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వెంకటశివనగర్‌లో నివాసం ఉంటున్న గొలగాని సన్యాసిరావు-మంగ దంపతుల రెండవ కుమార్తె పావనిని ఆమె ప్రేమించిన లంక హరికృష్ణకు ఇచ్చి 2019 జూన్ 23న వివాహం చేశారు. వారికి ఐదేళ్లు, రెండేళ్ల వయస్సు గల ఇద్దరు కుమారులు ఉన్నారు. ప్రైవేట్ సంస్థలో డ్రైవర్‌గా పనిచేస్తున్న హరికృష్ణకు మద్యం అలవాటు ఉంది. తరచూ తాగి వచ్చి భార్యతో గొడవ పడుతూ ఆమెను శారీరకంగా, మానసికంగా వేధించేవాడు. ఇటీవల హరికృష్ణ ఉద్యోగం పోవడంతో కుటుంబాన్ని నెట్టుకురావడానికి పావని(24) గోపాలపట్నంలోని ఓ బట్టల షాపులో చేరింది. డ్యూటీ చేసుకుని ఆమె ఇంటికి వచ్చేసరికి ప్రతిరోజూ గొడవ ప్రారంభమయ్యేది. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి భార్యాభర్తలు గొడవపడ్డారు. దీంతో మనస్తాపం చెందిన పావని ఇంటి హాల్‌లో ఫ్యాన్ హుక్‌కు చీరతో ఉరిపోసుకుంది. తన ఫోన్‌ను స్థానికంగానే ఉంటున్న కూతురి ఇంట్లో మరిచిపోయిన తండ్రి సన్యాసిరావు ఆమె ఇంటికి వెళ్లి తలుపు తట్టినా తీయకపోవడంతో కిటికీలో నుంచి చూడగా ఫ్యాన్ హుక్‌కు కూతురు వేలాడడం కనిపించింది. దీంతో ఆయన కేకలు వేయగా స్థానికులు వచ్చి తలుపులు తెరిచి, పావనిని 108లో ఆస్పత్రి తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే మార్గమధ్యంలో ఆమె మృతి చెందినట్లు 108 సిబ్బంది చెప్పడంతో తిరిగి ఇంటికి తీసుకొచ్చేశారు. అల్లారుముద్దుగా పెంచుకున్న కూతుర్ని ప్రేమించానంటూ నమ్మించి అల్లుడు ఉసురు తీసేశాడంటూ తల్లిదండ్రులు రోదిస్తుంటే చూపరుల కళ్లు చెమర్చాయి. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు సీఐ షణ్ముఖరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బంగారం దుకాణంలో చోరీ

బొండపల్లి: మండలంలోని గొట్లాం గ్రామంలో జాతీయరహదారిని ఆనుకుని ఉన్న సిద్ధి వినాయక జ్యూయలరీ షాపులో ఆదివారం తెల్లవారు జామున చోరీ జరిగింది. ఈ ఘటనలో బంగారం, వెండి వస్తువులతో కొంతమేర నగదు చోరీకి గురైనట్లు షాపు యజమానులు బొండపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి చోరీ జరిగిన తీరును, షాపు పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్సై మహేష్ విలేకరులతో మాట్లాడుతూ రోజూ మాదిరిగానే షాపు తెరిచేందుకు యజమాని తాళ్లపూడి సత్తిబాబు చేరుకోగా షట్టర్ సగానికి పైగా తెరిచి ఉండడంతో షాపులో దొంగతనం జరిగినట్లు గుర్తించి ఫిర్యాదు చేశరన్నారర. ఫిర్యాదు అందుకున్న తక్షణమే క్లూస్‌టీమ్‌తో వచ్చి పరిశీలించినట్లు చెప్పారు. దుకాణం షట్టర్లను రెండు గునపాలతో ఎత్తివేసి షాపులోకి దుండగులు చొరబడినట్లు గుర్తించామని తెలిపారు. బాధిత దుకాణం యజమాని చెప్పిన వివరాల ప్రకారం రూ.70వేల నగదు, 33 తులాల వివిధ రకాల వెండి వస్తువులు, రెండు తులాల బంగారం ఆభరణాలు చోరీ జరిగినట్లు నమోద చేసిన కేసులో దర్యాప్తు వేగవంతం చేసి నిందితులను త్వరలోనే పట్టుకుంటామని తెలియజేశారు.

వైద్యురాలి నిర్లక్ష్యంతో తల్లీశిశువులు బలి



మృతిచెందిన నిండు గర్భిణి నవ్య

- ఆస్పత్రి వద్ద బంధువుల ఆందోళన

వీరఘట్టం: పెళ్లైన మూడేళ్లకు తన భార్య పండంటి బిడ్డకు జన్మనివ్వనుందనే సంతోషంలో భర్త, మరో గంటలో తమచేతికి మనుమరాలో..మనుమడో రానున్నారన్న ఆనందంలో కన్నవారు, అత్తింటివారు ఉన్నారు. ఇంతలోనే ప్రసవానికి వెళ్లిన ఆమె మృతి చెందిందని తెలియడంతో కుటుంబసభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. వైద్యురాలి నిర్లక్ష్యంతోనే రెండు నిండు ప్రాణాలు బలైపోయాయని ఆగ్రహం వ్యక్తం చేస్తూ మృతురాలి కుటుంబసభ్యులు, బంధువులు ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగారు. వీరఘట్టం మండల కేంద్రంలోని కనోసా ఆస్పత్రి వద్ద ఆదివారం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి.



ఆస్పత్రి వద్ద రోదిస్తున్న మృతురాలి బంధువులు



ఆస్పత్రి వద్ద ఆందోళన చేస్తున్న మృతురాలి కుటుంబసభ్యులు, బంధువులు

వీరఘట్టం మండలంలోని దశమంతుపురం గ్రామానికి చెందిన వారాడ నవ్య(23) నిండుగర్భిణి. ప్రసవ సమయంలో ఆదివారం సాయంత్రం 4 గంటల ప్రాంతంలో వీరఘట్టం సమీపంలో ఉన్న కనోసా ఆస్పత్రిలో వైద్యం పొందుతూ మృతి చెందింది. ఆమె అత్తవారు జియ్యమ్మవలస మండలంలోని ఇటుక గ్రామానికి చెందిన వారు కాగా పురిటి సమయం కావడంతో కన్నవారిల్లు దశమంతుపురంలో ఉంటున్న ఆమెను ఈనెల 15వ తేదీన ఉదయం 8 గంటలకు కనోసా ఆస్పత్రిలో చేర్చారు. సాధారణ ప్రసవం అవుతుందని ముందుగా వైద్యురాలు చెప్పడంతో బంధువులంతా సంతోషించారు. అయితే ఆ సమయం కాస్తా చేయిదాటిపోవడంతో ఆపరేషన్ చేయాల్సి ఉందని వైద్యురాలు చెప్పిన గంట వ్యవధిలోనే నవ్య మృతి చెం దినట్లు అదే వైద్యురాలు చెప్పింది. నిండు గర్భిణి నవ్యతో పాటు గర్భంలో ఉన్న శిశువు కూడా మృతి చెందిందన్న విషయాన్ని వైద్యురాలు చెప్పడంతో కుటుంబసభ్యులు, బంధువులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు.

మత్తు డాక్టర్ లేకుండా ఆపరేషన్ ఎలా చేస్తారు?

గర్భిణులకు ఆపరేషన్ చేయాలంటే మత్తు డాక్టర్ ఉండాలి. అలాంటిది మత్తు డాక్టర్ లేకుండా మీరు ఆపరేషన్ ఎలా చేస్తారని మృతురాలి బంధువులు ఆస్పత్రి సిబ్బందిని ప్రశ్నించారు. ఆపరేషన్‌కు ముందు ఇక్కడ ఉన్న గైనిక్ మత్తు ఇంజక్షన్ ఇచ్చేటప్పుడు ఆ ఇంజక్షన్ వికటించి నవ్య చనిపోయినట్లు బంధువులు ఆరోపించారు. విషయం తెలిసిన వెంటనే పాలకొండ సీఐ ఎం.చంద్రమౌళి, వీరఘట్టం, పాలకొండ ఎస్సైలు జి.కళాధర్, ప్రయోగమూర్తిలు పోలీసు సిబ్బందితో వచ్చి ఆస్పత్రి వద్ద పరిస్థితిని పరిశీలించి ఆస్పత్రి సిబ్బంది దగ్గర వివరాలు సేకరిస్తున్నారు. అలాగే మృతురాలి బంధువులతో కూడా మాట్లాడారు. అయితే రాత్రి 8 గంటల వరకు రాజీ కుదిర్చేందుకు ప్రయత్నించినా సమస్య కొలిక్కిరాలేదు.



మృతురాలి బంధువుల దగ్గర వివరాలు తెలుసుకుంటున్న ఎస్సై కళాధర్

మొదటి కాన్పులోనే తల్లీశిశువు మృతి

నవ్యకు ఇది మొదటి కాన్పు కావడంతో పాటు మొదటి నుంచి ఇదే ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించినప్పటికీ కేవలం వైద్యురాలి నిర్లక్ష్యం వల్లే రెండు నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోయాయని బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు న్యాయం జరిగే వరకు ఆస్పత్రి నుంచి వెనుదిరిగేది లేదంటూ భీష్మించి ఆస్పత్రి ప్రాంగణంలో బైఠాయించారు.

ప్రజాపోరాటాలకు సిద్ధం

- మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

పాచిపెంట: ప్రభుత్వం చట్టాలను ఉల్లంఘిస్తే ప్రజాపోరాటాలకు, అవసరమైతే న్యాయపోరాటాలకు సిద్ధమని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర స్పష్టం చేశారు. ఆదివారం ఆయన పాచిపెంట మండలంలోని తాడూరులో మండలంలోని సర్పంచ్‌లు ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వంలో ఉపాధి హామీ చట్టాలను ఉల్లంఘించే విధంగా అధికారులు వ్యవహరిస్తున్నారని, ఫలితంగా వారికి అన్యాయం జరిగే అవకాశాలున్నాయని సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు వాపోతున్నారని తెలిపారు. టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం హయాంలో గత నెలలో గ్రామసభలు జరిగాయని, అందులో స్థానిక సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులకు కొన్ని ప్రాంతాల్లో సమాచారం కూడా ఇవ్వలేదని ఆరోపించారు. పనులు మంజూరు చేసిన వాటికి నేడు పంచాయతీ తీర్మానాలు, మండల తీర్మానాలు ఇవ్వాలని అధికారులు అడుగుతుండడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. అధికారులు చట్టాలకనుగుణంగా పాలన చేయాలని విజ్ఞప్తి చేశారు.



మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

'స్వచ్ఛభారత్' కార్యక్రమాలు విజయవంతం చేయాలి

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: స్వచ్ఛ భారత్ దినోత్సవం సందర్భంగా ఈ నెల 17వ తేదీ నుంచి అక్టోబర్ 2 వరకు జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛతా హే సేవ 2024 నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వచ్ఛభారత్ మిషన్ పదో వార్షికోత్సవం, స్వచ్ఛతా హే సేవా కార్యక్రమం ఏడు వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ కార్యక్రమాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. అక్టోబర్ 2న స్వచ్ఛభారత్ దివస్‌గా పాటిస్తున్నట్లు చెప్పారు. 'స్వభావ స్వచ్ఛత, సంస్కార స్వచ్ఛత' ఇతివృత్తంగా స్వచ్ఛతా హే సేవా-2024ను నిర్వహించనున్నామని సమాజం మొత్తాన్ని భాగస్వామ్యం చేస్తూ పక్షం రోజులపాటు మూడు ప్రధాన అంశాలపై ఆధారపడి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మారథాన్‌లు, సైక్లోథాన్‌లు, మానవహారాల నిర్వహణ, మొక్కల పెంపకంతో పాటు ఇతర సుందరీకరణ పనులు చేపట్టాలని పిలుపునిచ్చారు. అధిక జనసాంద్రత ఉన్న ప్రాంతాల్లో సామూహిక పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వివరించారు. సఫాయి మిత్ర సురక్ష విభాగంలో పారిశుధ్య కార్మికులను గౌరవించనున్నట్లు స్పష్టం చేశారు. పారిశుధ్య కార్యక్రమాల విజయవంతానికి ప్రజలు తమ వంతు సహకరించాలని కోరారు.



కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ప్రమాదాల నియంత్రణ చర్యలు చేపట్టాలి

- ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైమ్: జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో బ్లాక్‌స్పాట్స్ వద్ద తరచూ జరుగుతున్న రహదారి ప్రమాదాలకు కారణాలను అన్వేషించి, ప్రమాదాల నియంత్రణకు కార్యాచరణ రూపొందించాలని సంబంధిత పోలీసు అధికారులను ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశించారు. ఈ మేరకు ఆదివారం ఆయన పోలీస్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతూ, ప్రమాదాల్లో మరణాలు సంభవించిన ప్రాంతాలను బ్లాక్ స్పాట్స్‌గా పోలీసుశాఖ గుర్తించిందని, వాటిని డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, నేషనల్ హైవే ఆథారిటీ అధికారులు, మున్సిపల్, రవాణా, రోడ్లు భవనాల శాఖల అధికారులు సంయుక్తంగా సందర్శించాలని, ఆయా ప్రాంతాల్లో తరచూ రహదారి ప్రమాదాలు జరిగేందుకు గల కారణాలను అన్వేషించేందుకు సంబంధిత అధికారులు సంయుక్తంగా సందర్శించి కారణాలను గుర్తించి, చేపట్టాల్సిన చర్యలపై తగిన సూచనలు చేయనున్నారని చెప్పారు. కార్యక్రమంలో విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు, బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు, సీఐలు, ట్రాఫిక్ పోలీసులు, రవాణా, రోడ్లు భవనాలు, నేషనల్ హైవే అథారిటీ, మున్సిపల్, పంచాయతీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



బ్లాక్‌స్పాట్స్ వద్ద చేపట్టాల్సిన చర్యలపై చర్చిస్తున్న పోలీస్, ఆర్‌టీఓ, మున్సిపల్ తదితర శాఖల అధికారులు

డీఎస్పీలకు బదిలీ

విజయనగరం క్రైమ్: రాష్ట్ర వ్యాప్తంగా డీఎస్పీలను బదిలీలు చేస్తూ డీజీపీ ద్వారకా తిరుమలరావు ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. ఇందులో భాగంగా జిల్లాకు సంబంధించి డీటీసీ డీఎస్పీగా అనకాపల్లిలో పనిచేస్తున్న ఎం.శ్రీనివాసరావును విజయనగరం డీఎస్పీగా బదిలీ చేశారు. ఇంటెలిజెన్స్ డీఎస్పీగా పనిచేస్తున్న ఎస్. రాఘవులును చీపురుపల్లి డీఎస్పీగా బదిలీ చేశారు. పార్వతీపురం మన్యంజిల్లాకు సంబంధించి ఇంటెలిజెన్స్ డీఎస్పీగా పనిచేస్తున్న ఎం.రాంబాబును పాలకొండ డీఎస్పీగా బదిలీ చేశారు. అక్కడ పనిచేస్తున్న ఆయనను హెడ్ క్వార్టర్స్‌కు రిపోర్ట్ చేయాలని సూచించారు.

లారీ ఢీకొని ఇద్దరికి గాయాలు

రాకోడు నుంచి విజయనగరం బైక్‌పై వస్తున్న బైలపూడి రామకృష్ణ, వేచలపు నాగభూషణంలను జొన్నవలస హైవే అండర్ పాస్ వద్ద సడన్‌గా వచ్చిన లారీ ఢీకొనడంతో వారిద్దరికీ గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం విజయనగరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి స్థానికులు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం నాగభూషణాన్ని విశాఖకు తరలించినట్లు రూరల్ ఎస్సై అశోక్ కుమార్ తెలిపారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో జట్ల ఎంపిక

జే.పంగులూరు: జార్ఖండ్‌లో ఈ నెల 28 నుంచి అక్టోబర్ 2 వరకు జరిగే జాతీయ, రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు సబ్ జూనియర్ విభాగంలో బాలబాలికల జట్ల ఎంపిక పూర్తి చేసినట్లు ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి ఆదివారం తెలిపారు. బాపట్ల జిల్లా పంగులూరులోని మాగుంట సుబ్బరామిరెడ్డి, బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాలలో రాష్ట్ర బాలబాలికల జట్లు ఎంపిక చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల నుంచి 170 మంది క్రీడాకారులు పాల్గొన్నారని, వారిలో మంచి ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈఎంపికలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ చైర్మన్ బాచిన చెంచుగరటయ్య మాట్లాడుతూ అనివార్య కారణాల వలన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ పోటీలు నిర్వహించలేకపోయినట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులకు గ్రామస్తుల సహకారంతో పంగులూరులో ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. జాతీయ స్థాయిలో రాష్ట్ర జట్టు మంచి ప్రతిభ కనబరచాలని ఆయన ఆకాంక్షించారు. పోటీలకు ఎంపికైన వారిలో విజయనగరం జిల్లా నుంచి బాలుర జట్టులో ఎం.పవన్, బాలికల జట్టులో ఎం.ధనలక్ష్మి ఉన్నారు. వీరిని పలువురు అభినందించారు.

జాతీయ పోటీల్లో జిల్లాకు పతకాలు

- క్రీడాకారులకు మంత్రి శ్రీనివాస్ అభినందనలు

విజయనగరం: జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో విజయనగరం జిల్లాకు చెందిన క్రీడాకారులు సత్తా చాటారు. ఈనెల 8వ తేదీ నుంచి 10 వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ఆగ్రాలో జరిగిన జాతీయ సబ్ జూనియర్స్ తైక్వాండో పోటీల్లో పాల్గొన్న విజయనగరానికి చెందిన క్రీడాకారులు 8 మెడల్స్ సాధించారు. జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్న క్రీడాకారుల్లో కె.సాహిత్య (1 గోల్డ్ 1, బ్రాంజ్), పి.పునీత్ (1 సిల్వర్, 2 బ్రాంజ్), వి.కుశాల్ (1 సిల్వర్, 1 బ్రాంజ్), ఎస్ సాత్విక్ సిల్వర్ పతకం సాధించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచడంతో పాటు జాతీయస్థాయి పోటీల్లో పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులను రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదివారం అభినందించారు. రాబోయే జాతీయ, అంతర్జాతీయ పోటీలలో పాల్గొని జిల్లాకు, రాష్ట్రానికి పేరు తీసుకురావాలంటూ ప్రోత్సహించారు. కార్యక్రమంలో జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గురాన అయ్యలు, సీహెచ్ వేణుగోపాల్ రావు, జిల్లా కబడ్డీ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు అవనాపు విజయ్, కోచ్‌లు సీహెచ్ యశస్విని, గోపి, గగన్ పాల్గొని క్రీడాకారులను అభినందించారు.

జాతీయ స్థాయి క్రీడల్లో రాణించాలి

విజయనగరం: జాతీయస్థాయిలో జరిగే యోగాసన పోటీల్లో కూడా విజయనగరం క్రీడాకారులు చక్కగా రాణించాలని యోగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అవనాపు విక్రమ్ కోరారు. విశాఖ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర 49వ యోగాసన స్పోర్ట్స్ చాంపియన్ షిప్-2024లో ఉత్తమ ప్రతిభ కనబరిచి, ఓవరాల్ చాంపియన్‌షిప్‌లో వరుసగా 3,4,6 స్థానాల్లో నిలిచిన జిల్లా యోగా క్రీడాకారులను ఆదివారం ఆయన అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చుక్క సంధ్యారాణి(మూడవ స్థానం), మూడడ్ల రూపవతి(మూడవ స్థానం), మజ్జి గౌతమి(నాల్గవ స్థానం), శీర భారతి(నాలవ స్థానం), కొల్లబోను భవాని(ఆరవ స్థానం) సాధించి ఈ పోటీల్లో చక్కని ప్రతిభ కనబరిచారని ప్రశంసించారు. అక్టోబర్ నెలలో ఒడిశా రాష్ట్రంలోని కటక్‌లో జరిగే జాతీయ స్థాయి యోగాసన పోటీలకు వారంతా ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఒలింపిక్ క్రీడా సంఘం కార్యదర్శి సీహెచ్.వేణుగోపాల్, జిల్లా యోగా అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి భమిడిశెట్టి సన్యాశిరావు, యోగా శిక్షకులు పాల్గొన్నారు.



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్

ఏఐఎస్ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి

విజయనగరం పూల్‌బాగ్: ఏఐఎస్ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగభూషణం పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక అమర్ భవన్‌లో ఆదివారం రాష్ట్ర మహాసభల కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యలనగరంగా పేరుగాంచిన విజయనగరంలో స్వతంత్ర సంగ్రామంలో ఉజ్వల చరిత్ర కలిగిన ఏఐఎస్ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభలు నవంబర్ 27 నుంచి 30 వరకు జరుపుకోవడం విశేషమన్నారు. జిల్లా అధ్యక్షుడు ఎస్.సునీల్ మాట్లాడుతూ దేశంలో రాష్ట్రంలో విద్యా వ్యతిరేక విధానాల పైన పోరాటం చేస్తున్న ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని దేశ చరిత్రలోనే అశేష త్యాగాలతో పోరాటంలో పాల్గొన్న విద్యార్థి సంఘం అని చెప్పారు. నూతన జాతీయ విద్యా విధానం రద్దు చేయాలని , ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలలో సమస్యలు పరిష్కరించాలని అనేక పోరాటాల్లో ఏఐఎస్ఎఫ్ ముందువరుసలో ఉందని తెలిపారు. ఈ తరుణంలో విజయనగరంలో జరుగుతున్న 49వ రాష్ట్ర మహాసభలు అనేక తీర్మానాలకు, నూతన నాయకత్వానికి ఉత్తేజం నింపే వేదిక కాబోతుందని చెప్పారు. ఈ మహాసభలు జయప్రదం చేయడంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి పి. గౌరీశంకర్, పట్టణ నాయకులు రాము, భార్గవ్, కిరణ్, భరత్, శంకర్, సింహాద్రి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టీఆర్ వైద్యసేవలు వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న డా.రామ్మోహనరావు

పార్వతీపురం: ఎన్‌టీఆర్ ఉచిత వైద్యసేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కర్షకమహర్షి హాస్పిటల్ డైరెక్టర్ ప్రముఖ శస్త్రచికిత్స నిపుణుడు డా.ద్వారపురెడ్డి రామోహన్‌రావు కోరారు. ఆస్పత్రిలో గత 40 ఏళ్లుగా ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తున్న ఆయన ఆస్పత్రిలో ఆదివారం ఎన్‌టీఆర్ వైద్యసేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ మనిషి మంచి ఆహార అలవాట్లు పాటించడంవల్ల ఆరోగ్యకరమైన జీవితం పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఆస్పత్రి వద్ద అమృత ఆహారాన్ని కేవలం రూ.5లకే అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో స్త్రీవైద్య నిపుణురాలు డా.ప్రతిమ దేవి, స్కానింగ్ స్పెషలిస్టు జి.ప్రభాకరరావు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేటి తరానికి మోక్షగుండం ఆదర్శం

విజయనగరం రూరల్: ఇంజినీరింగ్ వ్యవస్థకే వన్నె తెచ్చిన మోక్షగుండం విశ్వేశ్వరయ్యను ఈనాటి తరం ఆదర్శంగా తీసుకుని ప్రయాణం చేయాలని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో ఇంజినీరింగ్ డే సందర్భంగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి ఆదివారం ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ మినిస్టీరియల్ హాల్‌లో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. రక్తదాతలకు ధ్రువపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ నేటి తరం ఇంజినీరింగ్ ఉద్యోగులు అంతా మోక్షగుండం విశ్వేశ్వరయ్య జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించిన పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.



మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

హైస్కూల్‌కు 75 ఏళ్లు



వీరఘట్టంలో కలుసుకున్న 1969 నుంచి 2020వరకు పదోతరగతి బ్యాచ్‌లకు చెందిన పూర్వ విద్యార్థులు

- వచ్చే ఏడాది జూన్ 8న వజ్రోత్సవాల నిర్వహణకు
- పూర్వ విద్యార్థుల ఏకగ్రీవ తీర్మానం

వీరఘట్టం: 2025 నాటికి వీరఘట్టం జిల్లా పరిషత్ స్కూల్ ఏర్పడి 75 ఏళ్లు అవుతున్నందున వచ్చే ఏడాది జూన్ 8న వజ్రోత్సవాలను నిర్వహించేందుకు పూర్వ విద్యార్థులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. దీనిలో భాగంగా రెండేళ్ల క్రితం నుంచి గత 52 బ్యాచ్‌లకు చెందిన పూర్వ విద్యార్థుల సమాచారంపై వాకబు చేశారు. కొందరిని స్వయంగా, మరి కొందరిని ఫోన్, వాట్సాప్, ఫేస్ బుక్ వంటి మాధ్యమాల ద్వారా సంప్రదించారు. ఈ మేరకు తాము విద్యనభ్యసించిన ఊరిలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఏర్పాటు చేశారు.

పాఠశాల అభివృద్ధికి చర్యలు..

వచ్చే ఏడాది నిర్వహించే వజ్రోత్సవాలతో పాటు వీరఘట్టం జిల్లా పరిషత్ హైస్కూల్ అభివృద్ధికి తమ వంతు కృషి చేద్దామని వారంతా తీర్మానం చేశారు. 1969 నుంచి 2020 వరకు చదివిన పదో తరగతి బ్యాచ్‌ల వారు సుమారు 2,500 మంది ఉంటారని అంచనా వేశారు. ఈ సమావేశానికి హాజరైన ప్రతి బ్యాచ్‌కు చెందిన వారు తమ గ్రూప్ సభ్యులకు ఇక్కడ జరిగిన సమావేశం వివరాలు తెలియజేసి వచ్చే ఏడాది జూన్ 8న జరగనున్న వజ్రోత్సవంలో పాల్గొని విజయవంతం చేసేలా అందరూ కృషి చేయాలని అందరూ నిర్ణయించారు.